సాక్షి
వైఎస్సార్ జిల్లా
ఆదివారం । 5 । అక్టోబర్ । 2025



అధికార మత్తు!
కొందరు అధికారులు తాము ప్రభుత్వ అధికారులమనే విషయాన్ని మరిచిపోతున్నారు. అధికార పార్టీ నేతల కనుసన్నల్లో వారికి అనుకూలంగా పనులు చేస్తున్నారు. -8లో



టీడీపీలో విభేదాలు బట్టబయలు!
ప్రొద్దుటూరు నియోజకవర్గానికి సంబంధించి తెలుగుదేశం పార్టీ నాయకుల మధ్య ప్రస్తుతం విభేదాలు బట్టబయలు అయ్యాయి. -8లో

గరిష్టం/కనిష్టం
32.2/25.9

వాతావరణం
జిల్లాలో శనివారం 25.9 – 32.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు శ్రీ మహర్షి వాల్మీకి జయంతి

కడప సెవెన్‌రోడ్స్: శ్రీ మహర్షి వాల్మీకి జయంతిని ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నేపథ్యంలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఎదురుగా ఉన్న వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించనున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జయంతి ఉత్సవాలు నిర్వహిస్తారు. అధికారులు, బీసీ సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు.

వైఎస్సార్ సీపీలో జిల్లా వాసులకు రాష్ట్ర పదవులు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన ఇద్దరికి రాష్ట్ర స్థాయి పదవులు దక్కాయి. జమ్మలమడుగుకు చెందిన మాడిశెట్టి శివకుమార్‌కు రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా, మైదుకూరుకు చెందిన కె.వీరారెడ్డి రాష్ట్ర వైఎస్సార్ టీయూసీ జనరల్ సెక్రటరీగా నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

పాత స్పందన హాలులో గ్రీవెన్స్‌సెల్

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా స్థాయి స్వచ్ఛ అవార్డుల కార్యక్రమం సభా భవనంలో నిర్వహిస్తున్న కారణంగా సోమవారం గ్రీవెన్స్‌సెల్ పాత స్పందన హాలులో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వరనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సమయానికి హాజరు కావాలని తెలిపారు.

రూ.3.30 లక్షలకు తలనీలాల వేలం

సిద్దవటం: కార్తీక మాసంలో భక్తులు నిత్యపూజయ్య స్వామికి సమర్పించే తలనీలాల పోగు హక్కు కోసం శనివారం నిర్వహించిన వేలంపాటలో రూ.3.30 లక్షలకు హెచ్చుపాటదారుడు దక్కించుకున్నాడు. దేవదాయశాఖ ఈఓ శ్రీధర్, రాజంపేట ఇన్‌స్పెక్టర్ జనార్దన్ ఆధ్వర్యంలో జరిగిన వేలంపాటలో 16 మంది పాల్గొన్నారు. వైఎస్సార్ జిల్లా మైదుకూరు, ప్రొద్దుటూరు, చాపాడు, జమ్మలమడుగు, కమలాపురం ప్రాంతాలకు చెందిన ఐదుగురు లక్ష రూపాయలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన్నారు. ఇందులో చాపాడు మండలం పల్లవోలు గ్రామానికి చెందిన జి.రామక్రిష్ణ రూ.3.30 లక్షలకు తలనీలాల పోగు హక్కును దక్కించుకున్నాడు. అనంతరం మిగిలిన డబ్బులు చెల్లించి అధికారుల నుంచి రసీదును పొందారు.

రేపు స్వచ్ఛ అవార్డుల ప్రదానోత్సవం

కడప సెవెన్‌రోడ్స్: కలెక్టరేట్‌లో సోమవారం సాయంత్రం 4 గంటలకు స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రదానం చేస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ తరహాలో జిల్లా స్థాయిలో స్వచ్ఛాంధ్ర అవార్డులను అందజేస్తున్నామన్నారు. రాష్ట్ర స్థాయిలో చెన్నూరు మండలం, చెన్నూరు గ్రామ పంచాయతీ ఎంపికయ్యాయన్నారు. స్వచ్ఛ రెసిడెన్షియల్ స్కూలు విభాగంలో పెద్దముడియం మండలం గుండ్లకుంట గ్రామంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకులం ఎంపికైందని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో 13 విభాగాలకు 48 పురస్కారాలు అందజేస్తున్నామన్నారు. స్వచ్ఛ మున్సిపాలిటీ అవార్డుకు జిల్లా స్థాయిలో కడప ఎంపికైందని తెలిపారు. ఉత్తమ స్వచ్ఛ గ్రామ పంచాయతీ విభాగంలో జిల్లాలోని నాలుగు మండలాలకు పురస్కారాలు అందాయన్నారు. ఉత్తమ గ్రీన్ అంబాసిడర్ విభాగంలో ఐదుమంది విజేతలుగా నిలిచారని వివరించారు.

ఆంధ్ర రంజీ ప్రాబబుల్స్‌కు ఎంపిక


దీపన్ సాయినాథ్

కలికిరి(వాల్మీకిపురం): వాల్మీకిపురం పట్టణానికి క్రికెట్ క్రీడాకారుడు దీపన్ సాయినాథ్ ఆంధ్రా రంజీ ప్రాబబుల్స్‌కు ఎంపికైనట్లు వాల్మీకిపురం సీడీసీఏ హెడ్‌కోచ్ సునీల్ కుమార్ తెలిపారు.శనివారం ఆయన మాట్లాడుతూ దీపన్ సాయినాథ్ లెఫ్ట్‌హ్యాండ్ స్పిన్ బౌలర్‌గా మొదటగా చిత్తూరు జిల్లా జట్టుకు, అనంతరం సౌత్‌జోన్ నుంచి ఉత్తమ ప్రతిభ కనపరచి ఆంధ్ర రంజీ క్యాంపునకు ఎంపికైనట్లు చెప్పారు. ఆంధ్ర క్రికెట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో విజయనగరంలో న్యూజిలాండ్ నుంచి వచ్చిన, రాష్ట్ర కోచ్‌ల పర్యవేక్షణలో క్యాంపు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి విజయ్‌కుమార్, ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోషియేషన్ కార్యదర్శి సతీష్ యాదవ్, ఉపాధ్యక్షులు శ్రీధర్‌కుమార్ సాయినాథ్‌కు అభినందనలు తెలిపారు.

మైండ్ గేమ్!

- మేయర్ ఎన్నిక.. పోటీలో పలువురు కార్పొరేటర్లంటూ కొత్త పల్లవి
- వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లల్లో చీలికల కోసం పచ్చపార్టీ కుయుక్తులు
- కడప కార్పొరేషన్‌లో బలహీన పరిచేందుకు కుట్రలు
- తెలుగుతమ్ముళ్ల ఎత్తుగడలకు వంత పాడుతున్న ఎల్లో మీడియా
- ఇన్‌ఛార్జి మేయర్‌లో అభద్రతాభవం సృష్టించి లబ్ధి పొందాలనే దిశగా అడుగులు





సాక్షి ప్రతినిధి, కడప: ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు సృష్టించడంలో టీడీపీ నేతలకు మరెవ్వరూ సాటిరారు. తాజాగా కడప కార్పొరేషన్‌లోనూ ఇదే పద్ధతి అవలంబిస్తున్నారు. రాజకీయ అలజడితో లబ్ధి పొందాలనే కొత్త కుట్రలకు తెరతీశారు. తమ్ముళ్ల ఎత్తుగడలకు ఎల్లో మీడియా వంత పాడుతోంది. కడప మేయర్ వ్యవహారం ఉన్నత న్యాయస్థానంలో వ్యవహారం నడుస్తోంది. కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఎమ్మెల్యేకు హైకోర్టు ఉత్తర్వులున్నాయి. ఇప్పటికిప్పుడే కోర్టులో వ్యవహారం తేలిపోయే అవకాశం లేదు. అయినప్పటికీ మేయర్ ఎన్నిక, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల మధ్య బహుముఖ పోటీ అంటూ తెలుగుతమ్ముళ్లు మైండ్‌గేమ్ ఆడుతున్నారు.

- కడప మేయర్ సురేష్‌బాబుపై ప్రభుత్వం అనర్హత వేటు వేసింది. డిప్యూటీ మేయర్ ముంతాజ్‌బేగంకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వం అనర్హత చర్యలపై మాజీ మేయర్ సురేష్ బాబు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఈనెల 7కు వాయిదా వేస్తూ, ఆ రోజు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాల్సిందిగా ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఫిర్యాదుదారు కడప ఎమ్మెల్యేకు నోటీసులు జారీ చేశారు. కౌంటర్ దాఖలైన తర్వాత ఇరుపక్షాల వాదనల అనంతరం ఫైనల్ తీర్పు వెలువడనుంది. ఈతతంగం ముగిసేంత వర కూ మేయర్ ఎన్నిక ఉత్పన్నమయ్యే అవకాశమే లేదు. ఇదిలాఉంటే... వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల మధ్య అలజడి లేపేందుకు తెలుగుదేశం పార్టీ నేతలు కుయుక్తులు పన్నుతున్నారు. కడప మేయర్ సీటు కోసం వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ల మధ్య బహు ముఖ పోటీ అంటూ పచ్చ నేతలు తానా అంటుంటే.. ఆ రెండు పత్రికలు తందాన అంటూ వంత పాడుతున్నాయి.

అలజడి సృష్టించి లబ్ధిపొందేందుకే...


'ఆదిగో పులి అంటే ఇదిగో తోక' అన్నట్లుగా టీడీపీ నేత లు, ఎల్లోమీడియా వైఖరి ఉందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల పేర్లు వారే ప్రకటించడం, వారే ప్రచారం చేయడం ఒకదాని వెంట ఒకటి తెరపైకి వస్తున్నాయి. కడప కార్పొరేషన్‌లో 50 మంది కార్పొరేటర్లు ఉండగా, ఒక్కరు మాత్రమే టీడీపీ కార్పొరేటర్. వైఎస్సార్ సీపీ నుంచి గెలుపొందిన వారిలో 8మంది టీడీపీ కండువా కప్పుకున్నారు. ఇద్దరు కార్పొరేటర్లు మరణించారు. 39మంది కార్పొరేటర్లు ఇప్పటికీ వైఎస్సార్‌సీపీకి ఉన్నారు. ఒకవేళ మేయర్ ఎన్నిక నోటిఫికేషన్ వస్తే కార్పొరేటర్లందరితో మాట్లాడి తమ పార్టీ నాయకత్వం సంయుక్తంగా నిర్ణయం తీసుకుంటుందని ఆపార్టీ సీనియర్ నేతలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికీ పార్టీలో ఉన్న కార్పొరేటర్లు సైతం అధిష్టానానికి విధేయులు. అలాంటి పరిస్థితే వస్తే వారంతా ఏకాభిప్రాయానికి వస్తారని విశ్లేషకులు వెల్లడిస్తున్నా రు. అందుకు జెడ్పీ చైర్మన్ ఎన్నికను ఉదాహరణగా చెబుతుండడం విశేషం. మేయర్ ఎన్నికలు ఇప్పుడిప్పుడే లేకపోయినప్పటికీ వైఎస్సార్‌సీపీ బీసీ కార్పొరేటర్ల మధ్య పోటీ అన్నట్లుగా ప్రచారం ఎత్తుకోవడంపై పలువురు అభ్యంతరం చెబుతున్నారు.

» అభద్రతాభావం సృష్టించేందుకు...

మేయర్ సురేష్‌బాబుపై అనర్హత వేటు పడగానే, డిప్యూటీ మేయర్‌గా ఉన్న ముస్లిం మైనార్టీకి చెందిన ముంతాజ్‌బేగంకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఈసందర్భంగా ఇకపై ముస్లిం మైనార్టీకి చెందిన మహిళ కడప కార్పొరేషన్ మేయర్‌గా పాలించనున్నట్లు టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి కూడా ప్రకటించారు. ముంతాజ్ బేగం బాధ్యతలు చేపట్టే కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ముఖ్యనేతలంతా సంయుక్తంగా హాజరయ్యారు. ఇదిలా ఉంటే ఇన్‌చార్జ్ మేయర్‌లో అభద్రతాభావం సృష్టించేందుకు కూడా మేయర్ ఎన్నికకు వైఎస్సార్‌సీపీ వారే పోటీ పడుతున్నారని ప్రచారం చేస్తున్నట్లుగా పరిశీలకులు భావిస్తున్నారు. వాస్తవంగా ఇన్‌ఛార్జి మేయర్ ముంతాజ్‌బేగం ప్రసన్నం కోసం టీడీపీ నేతలు ప్రయత్నించారు. వైఎస్సార్‌సీపీ బలోపేతం చేసేందుకు తమ కుటుంబం కట్టుబడి ఉంటుందని ఆమె ప్రకటించడంతో టీడీపీ నేతలు తోకముడిచారు. తిరిగి మేయర్ ఎన్నికంటూ దుష్ప్రచారం చేసి.. ఇన్‌చార్జ్ మేయర్‌లో అభద్రతాభావం కల్పిస్తే రాజకీయంగా లబ్ధి పొందవచ్చుననే దురాలోచన కూడా తెలుగుతమ్ముళ్లకు ఉన్నట్లు పలువురు స్పష్టం చేస్తున్నారు.

పల్లె వైద్యం పడక!

- గ్రామీణులకు లభించని వైద్య సేవలు
- 9వ రోజుకు చేరిన పీహెచ్‌సీ వైద్యుల ఆందోళన
- చోద్యం చూస్తున్న కూటమి పాలకులు



కడప రూరల్: గ్రామీణ వైద్యం పడకేసింది. ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారానికి వైద్యులు చేపట్టిన ఆందోళన శనివారం నాటికి 9వ రోజుకు చేరింది. దశల వారీగా చేపడుతున్న ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా గతనెల 26వ తేది నుంచి వైద్యులు విధులను బహిష్కరించి ఆందోళనలు చేపడుతున్నారు. దీంతో గ్రామీణుల ఆరోగ్యం అగమ్యగోచరంగా మారింది. జిల్లాలో మొత్తం 51 పీహెచ్‌సీలు ఉన్నాయి. బంద్ కారణంగా వైద్యుల కుర్చీలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. డాక్టర్లు లేరని తెలుసుకున్న స్థానికులు వైద్యం కోసం పట్టణాల్లోని ప్రైవేట్ ఆసుపత్రులకు వెళుతున్నారు.

సమ్మెను విఫలం చేసేందుకు యత్నాలు

వైద్యులు ఇన్ సర్వీసు పీజీ కోటాను పునరుద్ధరించాలి....టైమ్–బౌండ్ పదోన్నతులు అమలు చేయాలి...పీహెచ్‌సీ వైద్యులకు ఖచ్చితమైన పనిగంటలను నిర్దేశించాలి.. తదితర మొత్తం 11కు పైగా డిమాండ్లతో సమస్యల పరిష్కారానికి వైద్యులు సమ్మె చేస్తున్నారు. ఈ సమ్మెలో జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యులు విధులను బహిష్కరించి సమ్మె చేస్తున్నారు. ప్రభుత్వం ఈ సమ్మెను విఫలం చేసేందుకు ప్రయత్నాలు చేస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి తదితర ప్రభుత్వ విభాగాల నుంచి కొంతమంది వైద్యులను పీహెచ్‌సీలకు పంపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా టీడీపీ కూటమి పాలకులు ఏమాత్రం స్పందించకపోవడంపై గ్రామీణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యలను పరిష్కరించి సమ్మె విరమణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వైభవంగా స్నపన తిరుమంజనం

ఒంటిమిట్ట (సిద్దవటం): ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో శనివారం స్నపన తిరుమజనం వైభవంగా నిర్వహించారు. గర్భాలయంలోని మూల విరాట్‌కు అర్చకులు పంచామృతాభిషేకం జరిపారు. టీటీడీ వారు సమర్పించిన నూతన పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, తులసి గజమాలలతో సుందరంగా అలంకరించారు. అనంతరం స్వామి వారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు.


నూతన పట్టువస్త్రాలు తీసుకొస్తున్న టీటీడీ అధికారులు

వీరభద్రస్వామికి రూ.22,99,430 ఆదాయం

రాయచోటి టౌన్: రాయచోటి భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో శనివారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. జులై 1వ తేది నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా మొత్తం రూ.22,99,430 వచ్చినట్లు ఈవో డీవీ రమణా రెడ్డి తెలిపారు. అలాగే 43.063 గ్రాముల బంగారం, 1.870 కిలలో వెండి వచ్చిందని చెప్పారు. ఈ మొత్తం ఎస్‌బీఐ, ఏపీజీబీ బ్యాంకులో జమ చేశామని వివరించారు.


హుండీ ఆదాయం లెక్కిస్తున్న అధికారులు, భక్తులు

అన్నమయ్య జిల్లాలో వర్షం

పీలేరులో 84.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

రాయచోటి: ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లాలో శనివారం వర్షం కురిసింది. పీలేరులో 84.2 మిల్లీమీటర్లు,సుండుపల్లిలో 28 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.జిల్లాలోని రామసముద్రం, నిమ్మనపల్లి, మదనపల్లె, వాల్మీకిపురం, కలికిరి, కలకడ, కేవీపల్లి, గుర్రంకొండ, రాయచోటి ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది.

తెగిన చెరువు కట్ట..దెబ్బతిన్న పంట పొలాలు

పీలేరు రూరల్: పీలేరు – మదనపల్లె మార్గంలో నాలుగులేన్ల రహదారి విస్తరణలో భాగంగా నిర్మాణం కోసం కొత్తచెరువును తవ్వి వదిలేశారు. శనివారం కురిసిన భారీ వర్షానికి నీరు ఎక్కువగా చెరువులోకి చేరుకోవడంతో కట్టతెగిపోయింది. దీంతో దిగువన ఉన్న పంటపొలాలు దెబ్బతిన్నాయి. వరి, టమాట, ఆకు కూరలు తదితర పంటలకు నష్టం వాటిల్లింది. భూములు కోతకు గురయ్యాయి. సమాచారం అందుకున్న తహసీల్దార్ శివకుమార్, ఇరిగేషన్ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కట్ట పనులు వెంటనే చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. పీలేరు, సదుం మండలాల్లోని ఎగువ ప్రాంతాల్లో వర్షం విస్తారంగా కురిసింది.దీంతో పింఛా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. నూనెవాండ్లపల్లె మార్గాన్ని తహసీల్దార్ శివ కుమార్, సీఐ యుగంధర్ పరిశీలించి రాకపోకలు నిలుపుదల చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


పింఛా నదిలో నీటి ప్రవాహాన్ని చూస్తున్న ప్రజలు

నీట మునిగిన బస్టాండ్

పీలేరు: పీలేరులో శనివారం తెల్లవారుజాము నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. పట్టణంలోని రోడ్లపై నీరు నిలిచింది.బస్టాండ్ జలయమమైంది. బస్సుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం

ఎస్పీ నచికేత్ విశ్వనాథ్


మాట్లాడుతున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

పులివెందుల రూరల్: చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించి ఉక్కుపాదం మోపాలని ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆయన పులివెందుల సబ్ డివిజన్‌లోని పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్ల వారీగా అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాల గురించి పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతలు, డ్రగ్స్ నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పోలీసు అధికారుల అలసత్వం ఉన్నట్లు తెలిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. గ్యాంబ్లింగ్, క్రికెట్ బెట్టింగ్, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

తాగు, సాగు నీటికే ప్రాధాన్యత

కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

లింగాల: తాగు, సాగునీటికే తొలి ప్రాధాన్యత అని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శనివారం లింగాల మండలం పార్నపల్లె గ్రామ సమీపంలోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సీబీఆర్ నిర్వహణ, నీటి నిల్వలు, సరఫరా వ్యవస్థలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీబీఆర్ ఈ ప్రాంతానికి జీవనాధారం వంటిదన్నారు. పులివెందుల పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాలన్నింటికీ ఏ ఒక్క రోజు కూడా తాగునీటి కొరత రాకూడదన్నారు. సీబీఆర్ నుంచి వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల వరకు నీటి సరఫరా జరిగే పైప్‌లైన్లను, పంపింగ్ స్టేషన్లను ప్రతి వారం క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ఎక్కడైనా లీకులు ఉంటే తక్షణమే మరమ్మతులు చేయాలని సూచించారు. కాలువల్లో పూడిక లేకుండా చేసి, నీరు వృథా కాకుండా చూసే బాధ్యత ఇరిగేషన్ అధికారులదేనన్నారు. పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య, మున్సిపల్ కమిషనర్ రాముడు, జలవనరుల శాఖ అధికారులు వెంకట్రామయ్య, తదితరులు పాల్గొన్నారు.


సీబీఆర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, అధికారులు, తదితరులు

న్యాక్ బిల్డింగ్ భవనాల పరిశీలన

పులివెందుల రూరల్: పులివెందుల పట్టణంలోని రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న న్యాక్ బిల్డింగ్ భవనాలను శనివారం కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాక్ బిల్డింగ్ భవనాలు ఖాళీగా ఉంటే మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల హాస్టల్‌ను తాత్కాలికంగా ఇక్కడ ఏర్పాటు చేసే విషయమై ఆర్డీఓ చిన్నయ్యతో చర్చించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ ప్రిన్సిపల్ హరిత, మున్సిపల్ కమిషనర్ రాముడు, తదితరులు పాల్గొన్నారు.

ఇదేం పద్ధతి!

- ఆదాయ వనరులుగా అక్రమ మార్గాలను ఎంచుకుంటున్న తమ్ముళ్లు
- అధికారుల కళ్లెదుటనే కల్తీ మద్యం వ్యాపారం
- కొనసాగుతున్న ఎక్సైజ్ పోలీసుల విచారణ




ములకలచెరువులో యథావిధిగా నడుస్తున్న రాక్‌స్టార్ మద్యం దుకాణం

సాక్షి రాయచోటి: అన్నమయ్య జిల్లాలో నకిలీ మద్యం కలకలం రేపుతోంది. సార్వత్రిక ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ ఆదాయమే పరమావధిగా నాయకులు అడ్డదారులు ఎంచుకుంటున్నారు. ఏది పడితే అది దొరికిన కాడికి దోచుకుంటున్నారు. ఇప్పటికే ఇసుక, భూములు, రేషన్ బియ్యం, మైనింగ్, మద్యం ఇలా అన్నిచోట్ల అడుగులు పెట్టి అందిన కాడికి పక్కకు తోస్తున్నారు. ఇదేమని అడిగే అధికారులు, ఇది తప్పు అని చెప్పే ప్రజాప్రతినిధులు లేకపోవడంతో పచ్చ రాజ్యంలో తమ్ముళ్లు ఇష్టారాజ్యంగా చెలరేగిపోతున్నారు. నకిలీ మద్యం వల్ల ప్రాణాలకే ప్రమాదమని తెలిసినా బడా నేతల అభయమో..ముఖ్య నేతల భరోసానో తెలియదుగానీ పెద్ద ఎత్తున ములకలచెరువులో టీడీపీ నేతలు నకిలీ మద్యం తయారు చేయడం హాట్ టాపిక్‌గా మారిపోయింది.

ఇది తగునా?

కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏదో ఒక పని చేసుకుని మంచిగా సంపాదించుకుంటే ఎవరూ కాదనరు. అలా కాదని అక్రమ, వక్రమార్గాలను ఎంచుకోవడంపై ప్రజల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. టీడీపీకి చెందిన సీనియర్ నాయకులు సురేంద్రనాయుడుతోపాటు మరి కొంతమంది టీడీపీకి చెందిన కీలక వ్యక్తులు నకిలీ మద్యం తయారు చేసి బెల్ట్‌షాపులకు పంపిస్తున్న వ్యవహారం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీలో ఉంటూ ఏదైనా ప్రజలకు సేవ చేయాల్సిన నేతలు ఇలా చెడు మార్గాలను ఎంచుకోవడంపై ఇది తగునా? అంటూ పార్టీకి చెందినవారే ముక్కున వేలేసుకుంటున్నారు. నకిలీ మద్యం తయారు చేసి షాపులకు పంపడం మూలంగా...నిపుణులు లేకుండా స్పిరిట్‌తో కూడుకున్న విషం ప్రాణాలు తీస్తే అందుకు బాధ్యత ఎవరిదని పలువురు ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా ఏదో ఒకరకంగా సంపాదించుకోవాలన్న నెపంతో ఎంచుకున్న మార్గం చూసి ప్రతి ఒక్కరూ ఇదేం పద్ధతి అని ప్రశ్నిస్తున్నారు.

కొనసాగుతున్న విచారణ

జిల్లాలో కల్తీ మద్యం వ్యవహారానికి సంబంధించి ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులతోపాటు జిల్లా అధికారులు విచారణ చేస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో 10 మందిని అరెస్టు చేసి, మరో ముగ్గురి కోసం స్పెషల్ బృందాలు గాలిస్తున్నట్లు వెల్లడించారు. పెద్ద ఎత్తున నకిలీ మద్యాన్ని సీజ్ చేసిన ఎక్సైజ్ అధికారులు మరింత లోతుగా దర్యాప్తు చేయాలని, జిల్లాలో ఇంకా ఎక్కడైనా ఇలాంటి వ్యవహారాలు ఉన్నాయేమో విచారణ జరపాలని జిల్లా వాసులు డిమాండ్ చేస్తున్నారు.

» 'పచ్చ'పార్టీకి నకిలీ దెబ్బ

జిల్లాలో టీడీపీ నేతలు నకిలీ మద్యం వ్యవహారంలో అడ్డంగా దొరికిపోవడంతో పార్టీ పరువు బజారున పడింది. ప్రస్తుతం దొరికిన నాయకుల వెనుక ముఖ్య నాయకులు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. పెద్ద నేతల జోలికి వెళ్లకుండా దొరికిన వారి వరకే సర్దుతున్నట్లు తెలుస్తోంది. టీడీపీలో ఈ వ్యవహారం రాష్ట్ర స్థాయిలో ప్రకంపనలు సృష్టిస్తుండగా, నాయకులు అరెస్టు కావడంతో పచ్చ పార్టీ పరిస్థితి చూస్తే పరువు కాస్త గంగలో కలిసిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

- జిల్లాలోని ములకలచెరువు కేంద్రంగా తయారు చేస్తున్న నకిలీ మద్యం ఎక్కడికెక్కడికి సరఫరా చేస్తున్నారన్న దానిపై నిగ్గు తేల్చాల్సి ఉంది. ప్రస్తుతం ఎక్సైజ్ ఉన్నతాధికారుల ప్రాథమిక సమాచారం మేరకు ఇక్కడ తయారు చేసి ప్రముఖ సంస్థ లేబుళ్లు వేసి బెల్ట్ షాపులకు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు.ఒక్క ములకల చెరువు మండలంలోని బెల్ట్‌షాపులకేనా? లేదా నియోజకవర్గంతో జిల్లా వ్యాప్తంగా సరఫరా జరుగుతుందా? అన్న దానిపై వివరణ ఇవ్వాల్సి ఉంది. నకిలీ మద్యం కాబట్టి తక్కువ ఖర్చుతో ఎక్కువ సొమ్ము చేసుకునేందుకు ఇష్టానుసారంగా విష పదార్థాలు వాడటం మూలంగా తాగే వారి ప్రాణాలు గాలిలో కలిసే ప్రమాదముంది. అధికారులు పూర్తి స్థాయిలో విచారించి నకిలీపై నిగ్గు తేల్చాలని ప్రజలు కోరుతున్నారు. నకి లీ మద్యం నేపథ్యంలో సమీప ప్రాంతాల్లోని మందుబాబులు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం మంచిదని పలువురు సూచిస్తున్నారు.

ద్వంద్వ నీతి

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ములకలచెరువు నకిలీ మద్యం కేసుకు సంబంధించి నిందితుల్లో ఒకరిపై చర్యలు తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు, మరొకరిపై ప్రేమ చూపిస్తున్నారు. ఇక్కడ ప్రభుత్వ పెద్దలు, జిల్లాకు చెందిన ఓ ముఖ్యనేత కనుసన్నల్లో సాగిన కేసు దర్యాప్తు తీరే మారిపోయింది. ములకలచెరువు సమీపంలో నకిలీ మద్యం తయారీ కేంద్రాన్ని గుర్తించిన ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్‌పోలీసులు దాడి చేసి గుట్టురట్టు చేశారు. టీడీపీ మండల నాయకుడు సురేంద్రనాయుడు ఇంటిలో తనిఖీలు నిర్వహించి అక్కడ పది బాక్సుల నకిలీమద్యం స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ప్రకటించారు. తర్వాత తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి దగ్గర పీఏగా పనిచేస్తున్న రాజేష్‌కు సంబంధించిన పాలన్యాస్‌లోనే నకిలీమద్యం తరలిస్తున్నారని గుర్తించి సీజ్ చేసి అతనిపై కేసు నమోదు చేశామని, అరెస్ట్ కూడా చేస్తామని శుక్రవారం ప్రకటించారు.

రోజు గడిచాక.. శనివారం ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారి జోగేంద్ర పెద్దతిప్పసముద్రం వచ్చారు. నకిలీమద్యం కేసులో పట్టుబడిన సురేంద్రనాయుడు నిర్వహిస్తున్న ఆంధ్రా–కర్ణాటక సరిహద్దులో ఉన్న ఆంధ్రా వైన్స్ మద్యం దుకాణం సీజ్ చేశారు. తర్వాత ములకలచెరువులో మరో నిందితుడైన రాజేష్ నిర్వహణలోని మద్యం దుకాణం రాక్‌స్టార్ సీజ్ చేస్తారని భావించారు. అయితే టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి పీఏ రాజేష్ పేరుతో ఈ దుకాణం నిర్వహిస్తుండటంతో ఎక్సైజ్ అధికారులు అటువైపు వెళ్లలేదు.

క్లుప్తంగా

రైలు కింద పడి యువకుడి దుర్మరణం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

ముద్దనూరు : స్థానిక రైల్వేస్టేషన్ పరిధిలో శనివారం ఉదయం రైలు కింద పడి గుర్తు తెలియని యువకుడు(35) దుర్మరణం చెందాడు. ఎర్రగుంట్ల రైల్వే పోలీసు ఎస్‌హెచ్‌ఓ నాగాంజనేయులు సమాచారం మేరకు మృతుని వద్ద జమ్మలమడుగు నుంచి ముద్దనూరుకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించినట్లు బస్సు టికెట్ ఉంది. మృతుని శరీరంపై వున్న టీ-షర్టు ముందు భాగంలో నారాయణ మెడికల్ కాలేజి 2020 అని ముద్రించి ఉంది. మృతుని వివరాలు తెలిసిన వారు ఎర్రగుంట్ల రైల్వే పోలీసులను సంప్రదించాలని ఆయన కోరారు.

గుర్తు తెలియని మృతదేహం

చాపాడు : మండల పరిధిలోని విశ్వనాథపురం గ్రామ సమీపంలో ఏటూరు కాలువ వద్ద శనివారం గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపిన వివరాల మేరకు... 50 ఏళ్ల పైబడిన గుర్తు తెలియని మగ వ్యక్తి శవాన్ని గుర్తించామన్నారు. మృతదేహం బాగా కుళ్లిపోవడంతో ముఖం కూడా కనిపించడం లేదన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్‌కు గాయాలు

మదనపల్లె రూరల్ : ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో బైక్ అదుపుతప్పి ఏఆర్ కానిస్టేబుల్ గాయపడిన ఘటన శనివారం పట్టణంలో జరిగింది. పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లె మండలం పెద్దయల్లకుంట్ల పంచాయతీ బోయపల్లెకు చెందిన అమరనాథ్(30), రాయచోటిలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. గ్రామానికి వెళ్లే క్రమంలో మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసేందుకు వేగంగా వెళ్లాడు. వర్షం కారణంగా బైక్ అదుపుతప్పడంతో కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయమైంది. గమనించిన స్థానికులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పీలేరులో చోరీ

పీలేరు రూరల్ : పీలేరు పట్టణం తిరుపతి రోడ్డు మార్గంలోని జర్నలిస్టు కాలనీలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. వివరాలిలా ఉన్నాయి. స్థానిక జర్నలిస్టు కాలనీలో ఉంటున్న యు. రాజేష్ విద్యుత్ శాఖలో ఉద్యోగిగా పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి ఇంటిలో ఎవరూ లేని విషయం తెలుసుకున్న దుండగులు తలుపు పగుల గొట్టి ఇంటిలోకి చొరబడ్డారు. ఇంటిలో వెండి వస్తువులు, నాలుగు పట్టుచీరలు, రూ. 20వేలు నగదు, జత కమ్మలు, జత గాజులు కలిపి సుమారు 25 గ్రాముల బంగారు నగలతో ఉడాయించారు. శనివారం ఉదయం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆటంకాలు తొలగేలా..
ఆటలో మెరిసేలా..!

- నందలూరులో సొంత నిధులతో ఐదు ఎకరాల్లో క్రికెట్ మైదానం
- విజయవాడ తర్వాత క్రికెట్‌లో రాణింపునకు టర్ఫ్ వికెట్ పిచ్
- అందుబాటులోకి అంతర్జాతీయ స్థాయి స్టేడియం



పచ్చని గడ్డితో సిద్ధమవుతున్న క్రికెట్ క్రీడా మైదానం



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు మహమ్మద్ షేక్. మధ్య తరగతి కుటుంబానికి చెందిన వారు. నందలూరు బస్టాండులో టీ దుకాణం కొన్ని దశాబ్దాల నుంచి నిర్వహించుకుంటూ వస్తున్నారు. తన బిడ్డలు షేక్ ఆదిల్ హుసేన్, ఆసిఫ్‌లు క్రికెట్‌లో రాష్ట్ర స్థాయి వరకు వెళ్లారు. ఎలాగైనా జాతీయ స్థాయిలో భారత జట్టుకు ఆడాలనే బిడ్డల తపన, కృషి చూసిన తండ్రి తన బిడ్డలాగానే, తమ ప్రాంతం నుంచి క్రికెటర్లు మరికొందరు రాణించాలనే ఆలోచనతో క్రికెట్ ప్లేగ్రౌండ్ ఏర్పాటు చేశారు.

రాజంపేట : కడప-రేణిగుంట ప్రస్తుత హైవేలో నుంచి కిలోమీటర్ దూరం ఈదరపల్లె ఎస్టీకాలనీకి సమీపంలో నందలూరు సౌమ్యనాథాలయ రథం దారిలో ఐదు ఎకరాలను మహమ్మద్‌షేక్ పదేళ్లకు లీజుకు తీసుకున్నారు. దానిని క్రికెట్ స్టేడియంగా రూపొందిస్తున్నారు. క్రికెట్ శిక్షణ టోర్నమెంట్‌కు అవసరమైన రీతిలో ఉమ్మడి కడప జిల్లాలో ఎక్కడాలేని నెట్, గ్రౌండ్ ఉండే విధంగా క్రికెట్ మైదానాన్ని తీర్చిదిద్దుతున్నారు. తన స్థాయి ఎంత కష్టమైనా సరే..అన్నట్లుగా దాదాపు రూ.25 లక్షల వ్యయంతో తొలుత మైదానం చదును, మైదానంలో క్రికెట్ ఆటగాళ్లకు అనువైన రీతిలో గడ్డిని పెంచారు. బౌండరీలను ఏర్పాటు చేయడం, గ్యాలరీ తదితర క్రికెటర్లకు సదుపాయాలను కల్పించేందుకు అన్ని విధాలుగా తన ఇద్దరు కొడుకులు ఆదిల్, ఆసిఫ్‌లు, సమీప బంధువు క్రికెటర్ జాఫర్(స్టేట్‌ప్లేయర్)తో కలిసి రూపకల్పన చేస్తున్నారు.

క్రికెట్‌లో రాణించేందుకు...

క్రికెట్‌లో రాణించేందుకు క్రికెట్ మైదానంలో సకల సదపాయాలను కల్పించనున్నారు. హైస్టాండర్డ్ క్రికెట్ గ్రౌండ్, వన్ అండ్ వన్ కోచింగ్, సీనియర్ క్రికెటర్లతో శిక్షణ, రెగ్యులర్‌గా ఓపెన్ నెట్ సెషన్స్‌లు ఉంటాయి. తరచుగా ప్రాక్టీస్ మ్యాచ్‌ల ఏర్పాటు. టోర్నమెంట్ల నిర్వహణతోపాటు ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకునే విధంగా క్రికెటర్ ఫ్యామిలీ ముందుకెళుతోంది. వసతి పరంగా ఓపెన్ డార్మెంటరీ క్రీడాకారులకు ఇంటి భోజనం తరహాలో అందించడం, కామన్ టీవీ ఏరియా, నిరంతరం మంచినీటి సదుపాయం దశలవారీగా క్రికెట్ మైదానంలో అందుబాటులోకి తీసుకురానున్నారు.

ఉమ్మడి కడప జిల్లాలో మ్యాచ్‌లకు క్రికెట్ క్రీడా మైదానం..

ఉమ్మడి కడప జిల్లాలో ఎక్కడాలేని విధంగా నెట్‌తో పాటు క్రీడామైదానం కలిగివుండటం వలన క్రికెట్ అసోసియేషన్లు నిర్వహించే మ్యాచ్‌ల నిర్వహణకు దోహదపడుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో సరైన రీతిలో మైదానాలు లేక అనేక మందిలో దాగివున్న క్రికెట్ నైపుణ్యాలు వెలికితీసేందుకు అవసరమయ్యే శిక్షణ, మైదానాలు అందుబాటులో లేకపోవడం గమనార్హం. ఇప్పుడు నందలూరులో ఏర్పాటు కాబోతున్న క్రికెట్ మైదానం ఎందరో క్రికెటర్లను ఈ దేశానికి, రాష్ట్రానికి అందజేస్తుందనే ఆశాభావం క్రీడాభిమానుల్లో వ్యక్తమవుతోంది.

తొలిసారిగా అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్ మైదానం..

విజయవాడ తర్వాత క్రికెటర్స్ ఫ్యామిలీ నందలూరు క్రికెట్ క్రీడా మైదానంలో అంతర్జాతీయ స్థాయిలో స్టేడియం, పిచ్ ఏర్పాటు చేస్తున్నారు. ఇదే ప్రప్రథమనే చెప్పవచ్చు. అంతర్జాతీయ క్రికెటర్స్ ఆడే మ్యాచ్‌లో వినియోగించే పిచ్ టర్ఫ్ వికెట్ విజిబిలిటీ ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం విశేషంగా క్రికెట్ క్రీడాభిమానులు చెప్పుకుంటున్నారు.



అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్ పిచ్ టర్ఫ్ వికెట్ విజిబిలిటీ (నమూనా)

క్రికెట్ మైదానం ఎక్కడంటే..

కడప-రేణిగుంట జాతీయరహదారి మండల క్లాంపెక్స్ నుంచి కిలోమీటర్‌లో ఈదరపల్లె రహదారిలో క్రికెట్ క్రీడామైదానాన్ని తీర్చిదిద్దుతున్నారు. ప్రశాంత వాతావరణంలో, చుట్టూ పంటపొలాలు, తోటలు ఆహ్లాదకరమైన వాతావరణంలో క్రీడామైదానం ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పుడు క్రికెట్ క్రీడాకారుల దృష్టి దీనిపై పడింది. నందలూరు రైల్వేకేంద్రం నుంచి బస్టాండుకు చేరుకొని అక్కడి నుంచి మండల క్లాంపెక్స్‌కు మార్గంలో వెళ్లాలి. ఈదరపల్లె ఎస్టీ కాలనీ దాటిన తర్వాత నందలూరు సౌమ్యనాథస్వామి రథం దారిలో దీనిని అందుబాటులోకి తీసుకొస్తున్నారు.



ఈ యువ క్రీడాకారుడి పేరు షేక్ ఆదిల్ హుసేన్.. చిన్నప్పటి నుంచి క్రికెట్‌లో రాణించాలనే తపనతో అనునిత్యం ప్రాక్టీస్‌లోనే బాల్యం, యువ జీవితం గడుపుతున్నాడు. జోన్, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు అనేక క్రికెట్ పోటీలలో తన ప్రతిభను చాటుకున్నాడు. ఎలాగైనా భారత జట్టుకు ఆడాలనే కృషితో క్రికెట్ క్రీడలో రాటుదేలుతున్నాడు. ఆల్‌రౌండర్‌గా రాణిస్తున్నాడు.



ఇతని పేరు షేక్ ఆసిఫ్. ఇతను కూడా తన సోదరుడితో పాటే క్రికెట్‌లో వివిధ స్థాయిలో తన ప్రతిభను చాటుకున్నాడు. స్టేట్ ప్లేయర్‌గా రాణించాడు. ఇతనికి కూడా జాతీయ స్థాయిలో క్రికెటర్‌గా రాణించాలనే లక్ష్యం ఉంది. అందుకు తగ్గట్టుగా కృషి చేస్తున్నాడు. తోటి యువతను క్రికెట్ రంగం వైపు మళ్లించేందుకు తన తండ్రి ప్రోత్సాహంతో క్రికెట్ మైదానాన్ని ఏర్పాటు చేసుకొని, తమ ప్రాంతానికి క్రికెట్ పరంగా గుర్తింపు తీసుకురావాలనే తలంపుతో ముందుకెళుతున్నాడు. బ్యాట్స్‌మెన్‌గా రాణిస్తున్నాడు.



ఈ యువ క్రీడాకారుడు జాఫర్. నందలూరు గ్రామం. స్టేట్‌ప్లేయర్‌గా రాణించాడు. అన్ని స్థాయిల్లో క్రికెట్‌లో తన ప్రతిభను చాటుకుంటూ వెళుతున్నాడు. ఏపీ క్రికెట్ అసోసియేషన్ సహకారం అందిస్తే గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు వెళ్లే క్రికెటర్లను ఈ దేశానికి అందించవచ్చనే ఉద్దేశంతోనే తాము క్రీడా మైదానం, అంతర్జాతీయ స్థాయిలో ఆటగాళ్లు ఆడే టర్ఫ్ వికెట్ విజుబిలిటి పిచ్‌ను ఏర్పాటుచేస్తున్నాము. బ్యాట్స్‌మెన్‌గా రాణించారు.

పెన్షన్ డబ్బులతో ఆన్‌లైన్ బెట్టింగ్!

రామసముద్రం : లబ్ధిదారులకు పెన్షన్ నగదు పంపిణీ చేయకుండా వెల్ఫేర్ అసిస్టెంట్ ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడిన సంఘటన రామసముద్రం మండలంలో జరిగింది. ఎంపీడీఓ లతీఫ్ ఖాన్ వివరాల మేరకు ఆర్.నడింపల్లి సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న గిరి పెన్షన్‌దారులకు నగదు పంపిణీ చేయకపోవడంతో ఫిర్యాదులు వచ్చాయన్నారు. దీనిపై విచారణ చేయగా వెల్ఫేర్ అసిస్టెంట్ పెన్షన్ నగదుతో ఆన్‌లైన్ గేమ్స్ ఆడినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. ఇప్పటివరకు విచారణలో రూ.2.56 లక్షల పింఛన్ సొమ్ము తేలిందన్నారు. గతంలో పీటీఎం మండలంలో పనిచేసేటప్పుడు కూడా పింఛన్ సొమ్మును ఆన్‌లైన్ గేమ్ ఆడేందుకు వినియోగించడంతో అక్కడ సస్పెండ్ అయ్యాడన్నారు. పెన్షన్ సొమ్మును దుర్వినియోగం చేసిన వెల్ఫేర్ అసిస్టెంట్ పై డీఆర్‌డీఏ పీడీకు ఫిర్యాదు చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

5జీ మొబైల్స్ ఇచ్చే వరకు విధుల బహిష్కరణ

ఒంటిమిట్ట (సిద్ధవటం) : 5జీ మొబైల్స్ ఇచ్చే వరకు ఆన్‌లైన్ పనులు బహిష్కరిస్తున్నామని ఒంటిమిట్ట వెలుగు వీఓఏలు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ఒంటిమిట్ట వీఓఏలు ఏపీఎం అశోక్‌రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 5జీ మొబైల్స్ ఇవ్వకుండా కింది స్థాయిలో ఆన్‌లైన్ పనులు చేయలేదని వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ప్రతి పనికి లక్ష్యాన్ని పెట్టి ఒత్తిడి పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



వెలుగు ఏపీఎం అశోక్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న ఒంటిమిట్ట మండల వీఓఏలు

రాజకీయ కక్షతో ఇద్దరు ఆనిమేటర్ల తొలగింపు

కలసపాడు : తెలుగుదేశం పార్టీ నాయకుల కక్ష సాధింపు చర్యల్లో భాగంగా కలసపాడు మండలంలో ఇద్దరు ఆనిమేటర్లు బలయ్యారు. మండలంలోని తెల్లపాడు గ్రామ పంచాయతీకి చెందిన వరలక్ష్మి, సుహాసినిలను మండల వెలుగు అధికారులు తొలగించారు. తెల్లపాడు గ్రామ పంచాయతీలో 70కి పైగా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వాటికి ఇద్దరు ఆనిమేటర్లు సహాయ సహకారాలు అందిస్తున్నారు. అయితే అదే గ్రామ పంచాయతీకి చెందిన టీడీపీ నాయకుడు గ్రామ సమాఖ్యలో స్త్రీనిధి కింద రుణం తీసుకుని రూ.1.63 లక్షలు బాకీ పడి చెల్లించకపోవడంతో ఇద్దరు ఆనిమేటర్లు ఆయనపై ఒత్తిడి తెచ్చారు. దీనిని జీర్ణించుకోలేని ఆ నాయకుడు మండల వెలుగు అధికారులపై ఒత్తిడి తెచ్చి ఎలాంటి గ్రామసభ ఆమోదం లేకుండానే నిర్దాక్షిణ్యంగా ఆ ఇద్దరు ఆనిమేటర్లను తొలగించారు. వరలక్ష్మి 16 సంవత్సరాలుగా ఆనిమేటర్‌గా పనిచేస్తోంది. ఆమె నిజాయితీగా విధులు నిర్వహిస్తూ స్వయం సహాయక సంఘాలకు సేవలు అందించడం జీర్ణించుకోలేని స్థానిక టీడీపీ నాయకుడు అధికారులపై ఒత్తిడి తెచ్చి వారిరువురిని తొలగించారు. వారి స్థానంలో అదే గ్రామ పంచాయతీకి చెందిన వద్దెపోగు జ్యోతి, మీసాల మౌనికలను ఆనిమేటర్లుగా అధికారులు నియమించారు. ఈ విషయంపై వెలుగు ఏపీఎం సుబ్బరాయుడును వివరణ కోరగా మూడు సంవత్సరాలు పనిచేసిన ఆనిమేటర్లను తొలగించేందుకు ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిందని, ఆ మేరకే వారిని తొలగించామని తెలిపారు.

అధికార పార్టీ సేవలో పోలీసులు

కడప కార్పొరేషన్ : 'ఆటో డ్రైవర్ల సేవలో' పేరుతో ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమానికి ఆటో డ్రైవర్లను బలవంతంగా తరలించారని పలువురు ఆరోపించారు. ట్రాఫిక్ పోలీసులు ఆటో కార్మికులను ఆపి వారి తాళాలు లాక్కొని ఆటోలను వైఎస్సార్ ఆడిటోరియానికి తరలించినట్లు తెలుస్తోంది. పోలీసులు తాళాలు లాక్కోవడంతో ఆటో కార్మికులు వారి చుట్టూ ప్రదక్షిణలు చేసి వారు చెప్పినట్లు చేశారు. మున్సిపల్ హైస్కూల్‌లో తరగతులు నిర్వహిస్తున్న సమయంలో ఆటో ర్యాలీ కోసం ఆటోలన్నీ స్కూల్ ప్రాంగణంలో ఉంచడంతో శబ్ద కాలుష్యం ఏర్పడింది.

ప్రభుత్వ కార్యక్రమమా... పార్టీ ప్రోగ్రామా...

'ఆటో డ్రైవర్ల సేవలో' పేరుతో కూటమి ప్రభుత్వం నిర్వహించిన ప్రభుత్వ కార్యక్రమానికి వైఎస్సార్ ఆడిటోరియంలో వేదిక మొత్తం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో నిండిపోయింది. దీంతో ఇది ప్రభుత్వ కార్యక్రమమా లేదా పార్టీ కార్యక్రమమా అన్న సందేహం కలిగింది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసుల రెడ్డి మొదలుకొని ఆ పార్టీ నేతలు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, నగర అధ్యక్షుడు మన్సూర్ అలీఖాన్, ఫిరాయింపు కార్పొరేటర్లు కె. సూర్యనారాయణ రావు, ఎం. సుబ్బారెడ్డిలు వేదికపై ఆసీనులయ్యారు. కమిషనర్ మనోజ్‌రెడ్డి, ఆర్‌టీఓ కార్యాలయం తరుపున ఓ అధికారి మాత్రమే పాల్గొన్నారు.



ఆటో కార్మికుని నుంచి తాళాలు తీసుకున్న కానిస్టేబుల్

అధికార 'మత్తు'!

ఆటోలో కూర్చుని విజేత సింబల్ చూపిన ఆర్డీఓ

సాక్షి టాస్క్‌ఫోర్స్ : కొందరు అధికారులు తాము ప్రభుత్వ అధికారులమనే విషయాన్ని మరిచిపోతున్నారు. అధికార పార్టీ నేతల కనుసన్నల్లో వారికి అనుకూలంగా పనులు చేస్తూ వారి అండదండలు, మెప్పు కోసం అహర్నిశలూ కృషి చేస్తున్నారు. ఇదంతా ఒక ఎత్తయితే అవకాశం వస్తే చాలు తాము అధికార పార్టీకి ఎంత వీర విధేయులమో బహిరంగంగా ఫోకస్ కావడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ కోవలోనిదే ఈ చిత్రంలోని సన్నివేశం. కమలాపురం పట్టణంలో శనివారం ఆటో డ్రైవర్ సేవలో పథకం నియోజకవర్గ స్థాయి ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మార్కెట్ యార్డు వద్ద నుండి టీడీపీ కార్యాలయం వరకు ఆటోల ర్యాలీ నిర్వహించారు. ఇందులో ఒక ఆటోను అధికార పార్టీకి చెందిన స్థానిక ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణ చైతన్య రెడ్డి డ్రైవర్ సీటులో కూర్చుని స్వయంగా నడిపారు. ఈ క్రమంలో ఆయన టీడీపీకి ప్రజల్లో స్పెషల్‌గా గుర్తింపు వున్న విక్టరీ సింబల్‌ను చూపుతూ ప్రజలకు అభివాదం చేస్తూ వెళ్లారు. ఒక ప్రజా ప్రతినిధిగా ఆయన తన పార్టీ సింబల్‌ను చూపడం సాధారణ విషయమే. అయినప్పటికీ అదే ఆటోలో ఎమ్మెల్యే వెనుక సీటులో టీడీపీకి చెందిన ఒక మండల నేత పక్కన కూర్చున్న కడప ఆర్డీఓ జాన్ ఎర్విన్ సైతం దారి వెంబడి ఉత్సాహంగా అదే సింబల్ చూపుతూ టీడీపీ కార్యాలయం వరకు ప్రయాణించడం విమర్శలకు తావిచ్చింది.



ఆటో ర్యాలీలో ఎమ్మెల్యే వెనుక సీటులో కూర్చుని విక్టరీ సింబల్ చూపుతున్న ఆర్డీఓ(వృత్తంలో)

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

జమ్మలమడుగు రూరల్ : గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో పెద్ద చౌరెడ్డి (55) అనే వ్యక్తి మృతి చెందాడు. పట్టణ పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జమ్మలమడుగు మండల పరిధిలోని అంజనపురం గ్రామానికి చెందిన పెద్ద చౌరెడ్డి సొంత పనుల నిమిత్తం శుక్రవారం రాత్రి పట్టణానికి వస్తుండగా మార్గమధ్యంలోని పెన్నానది బ్రిడ్జి వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

టీడీపీలో విభేదాలు బట్టబయలు!

- ఎమ్మెల్యే వరద అభిప్రాయాన్ని వ్యతిరేకించిన ప్రవీణ్
- డీఏడబ్ల్యూ కళాశాల, మహర్షి ఆశ్రమం కొనుగోలుపై విమర్శలు



ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



జీవీ ప్రవీణ్ కుమార్‌రెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు నియోజకవర్గానికి సంబంధించి తెలుగుదేశం పార్టీ నాయకుల మధ్య ప్రస్తుతం విభేదాలు బట్టబయలు అయ్యాయి. వాస్తవానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి లోలోపల విభేదాలు ఉన్నా బయటికి కనిపించలేదు. ప్రస్తుతం బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రవీణ్ టీడీపీ ఇన్‌చార్జిగా శ్రమించి జైలుపాలయ్యారు. ఇంత కష్టపడినా ప్రవీణ్‌కు టీడీపీ టికెట్ ఇవ్వకపోగా, ఎన్నికల ముందు పార్టీలో చేరిన నంద్యాల వరదరాజులరెడ్డి టికెట్ దక్కించుకుని ఎమ్మెల్యేగా గెలుపొందారు. అప్పటి నుంచి నేతల మధ్య విభేదాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎవరి నాయకత్వం వారిదే అయింది. వరదరాజులరెడ్డి, ప్రవీణ్‌తోపాటు మాజీ ఎమ్మెల్యే మల్లేల లింగారెడ్డి ప్రముఖ టీడీపీ నాయకులుగా ఉన్నారు. ఏడాదిన్నర కాలంలో వీరెప్పుడూ ఒకరి గుమ్మం మరొకరు తొక్కలేదు. ఈ నేతల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఉంది. పార్టీ పదవుల నియామకంలో కానీ, కమిటీల ఏర్పాటులో కానీ పొసగడం లేదు. ఎమ్మెల్యే వర్గీయులు ప్రవీణ్‌పై పలు సందర్భాల్లో విమర్శలు గుప్పించారు.

బహిరంగంగానే విమర్శలు

ఏడాదిన్నరపాటు సైలెంట్‌గా ఉన్న ప్రవీణ్ ఇప్పుడిప్పుడే తన ఉనికిని చాటుకుంటున్నారు. పలు మార్లు సీఎం చంద్రబాబుతోపాటు మంత్రి లోకేష్‌ను స్వయంగా కలిసి నియోజకవర్గ అంశాలను ప్రస్తావించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఎమ్మెల్యే వరద తీరును బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇటీవలి అసెంబ్లీ సమావేశాల్లో డీఎస్పీతోపాటు పోలీసుల తీరును ఎమ్మెల్యే స్వయంగా విమర్శించారు. నియోజకర్గంలో శాంతి భద్రతలు గాడితప్పాయని, పోలీసులు సక్రమంగా పనిచేయడం లేదని, అసాంఘిక కార్యక్రమాలను అరికట్టలేకపోతున్నారని తెలిపారు. అసెంబ్లీని వేదికగా చేసుకుని ఎమ్మెల్యే చేసిన విమర్శలు చర్చనీయాంశంగా మారాయి. శనివారం ప్రవీణ్ వరదకు కౌంటర్ ఇచ్చారు. డీఎస్పీతోపాటు పోలీసుల పనితీరు చాలా బాగుందని, తాను చెప్పినట్లు వినలేదని కొందరు పోలీసులను విమర్శించారని చెప్పడం గమనార్హం. అసాంఘిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న తమ అనుచరులను పోలీసులు అరెస్టు చేస్తే వారిని విమర్శించడం, గత 40 ఏళ్లుగా అనవాయితీగా వస్తోందన్నారు. అప్పులు తీసుకుని ఎగ్గొట్టిన వారిని ప్రశ్నించిన వారిపై బలవంతంగా కేసు పెట్టించి ఇబ్బందులు కలుగజేస్తున్నారన్నారు. తనకు అనుకూలంగా లేని అధికారుల పట్ల ఇలానే వ్యవహరిస్తున్నారని చెప్పకనే వరదను ఎత్తిపొడిచారు. ఇటీవల ఎమ్మెల్యే ముఖ్య అనుచరులు బొల్లవరంలోని మహర్షి ఆశ్రమం స్థలాన్ని కొనుగోలు చేశారు. దీంతోపాటు ప్రస్తుత ఎమ్మెల్యే వరద తనయుడు కొండారెడ్డి ఆధీనంలో ఉన్న డీఏడబ్ల్యూ కళాశాల స్థలం వ్యవహారంపై కూడా ప్రవీణ్ విమర్శలు గుప్పించారు.

ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంపు వెంటనే ఆపాలి

కడప సెవెన్‌రోడ్స్ : కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి డ్యాం ఎత్తును 519.6 మీటర్ల నుంచి 524.256 మీటర్లకు పెంచే ప్రయత్నం వెంటనే ఆపాలని రాయలసీమ ఆకాంక్షల వేదిక కన్వీనర్ ఎ.రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆల్మట్టి ఎత్తు పెంచడం సుప్రీం కోర్టు తీర్పును ఉల్లంఘించడమేనన్నారు. కర్ణాటక 150 టీఎంసీల నీటిని నిల్వ చేసి 250 టీఎంసీలు అక్రమంగా వినియోగించవచ్చని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన 811 టీఎంసీల నీరు తెలుగు రాష్ట్రాలకు సరిపోవడం లేదన్నారు. ఆల్మట్టి ఎత్తు పెంపు రాయలసీమలో నీటి కొరతను తీవ్రతరం చేస్తుందన్నారు. గతంలో ఆల్మట్టి ఎత్తును 509.016 నుంచి 519.6 మీటర్లకు పెంచినప్పుడు వివాదం తలెత్తిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ డ్రాఫ్ట్‌తో కర్ణాటక 65 శాతం నీటి ప్రవాహం ఆధారంగా 70 వేల కోట్లు కేటాయించడం 1956 చట్టాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. కృష్ణా జలాలు 75 శాతం నమ్మకమైన ప్రవాహం ఆధారంగా పంచాలని, ఆల్మట్టి ఎత్తును 519.6 మీటర్లకు పరిమితం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై తక్షణమే స్పందించాలని, కేంద్రం జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఏఆర్ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన పి. నాగేశ్వరరావు

కడప అర్బన్ : వైఎస్ఆర్ కడప జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ విభాగంలో నూతన ఏఆర్ డీఎస్పీగా పి.నాగేశ్వర రావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన 1996 లో ఆర్.ఎస్.ఐ గా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించి విశాఖపట్నం రూరల్, విజయనగరం తదితర జిల్లాల్లో విధులు నిర్వర్తించారు. 2010లో ఆర్.ఐ గా పదోన్నతి పొంది విజయనగరం పి.టి.సి, విశాఖపట్నం లలో పని చేశారు. 2022 లో డీఎస్పీగా పదోన్నతి పొందారు. అనకాపల్లిలో ఏఆర్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీలలో భాగంగా జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగం తరపున విధులు నిర్వహిస్తామన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం
– జిల్లా ఇన్‌చార్జి మంత్రి



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, తదితరులు

పులివెందుల టౌన్/రూరల్ : ప్రజా సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత పేర్కొన్నారు. శనివారం పులివెందులలో ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని ఆమె జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు, ఆటో డ్రైవర్లు పట్టణంలోని పూలంగళ్ల సర్కిల్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ఆటోల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

టీకాలు వేసేటప్పుడు మెలకువలు పాటించాలి



వైద్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వర్‌కుమార్

ఎర్రగుంట్ల : చిన్న పిల్లలకు టీకాలు వేసేటప్పుడు ప్రతి ఏఎన్ఎం మెలకువలు పాటించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వర్‌కుమార్ తెలిపారు. శనివారం ఎర్రగుంట్ల పట్టణ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేశారు. అనంతరం పట్టణ పరిధిలోని ఏఎన్ఎంలు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధ, శనివారాల్లో క్రమం తప్పకుండా పిల్లలకు వ్యాక్సినేషన్ వేయాలన్నారు. ఎలాంటి పొరబాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, సీహెచ్‌ఓ మునిరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ ఓబులేసు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి మాస కల్యాణం



స్వామి, అమ్మవారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలో శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి మాస కల్యాణోత్సవం శనివారం వైభవంగా జరిగింది. శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలోని కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ చేసి, విశేష పూజలు చేపట్టారు. అనంతరం వేదపండితులు మంత్రోచ్చారణతో కల్యాణ క్రతువు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కనులారా దర్శించుకుని తరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి, సిద్ధాంతి ఇడమకంటి జనార్దన శివాచార్య, పూర్వపు మఠాధిపతి కుటుంబ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

ADMISSIONS

Join B.Sc Ai / CSc over 60%, Maths in 10+2 get 5000 fee discount. Join M.Com / MA English / MSW by 6/10/2025, 3000 fee discount. ✆ 9177408565

REAL ESTATE

PLOT FOR SALE

కడప ఎయిర్‌పోర్ట్ దగ్గర ఉన్న శ్రీ సత్య గ్రీన్ సిటీ వెంచర్‌లో ప్లాట్ నెం.6425, 6426 ఈస్ట్ ఫేస్ 2సెంట్ల బిట్ అమ్మబడును.సెంట్ లక్ష మాత్రమే.8074083679.

TOLET

కడప హౌసింగ్ బోర్డు నందు రాయలసీమ గ్రామీణ బ్యాంకు ప్రక్కన MIGH ఇల్లు ఆఫీస్ / ట్యూషన్ /స్టాక్ పాయింట్‌కు బాడుగకు ఇవ్వబడును ✆ 9550192312

SERVICES

CHANGE OF NAME

I, CHOPPA CHENCHU REDDY (OLD NAME), R/O. H.NO. 1/33-3, CHOPPAVARIPALLI (V), PULLAMPET (M), ANNAMAYYA (DT), A.P., HEREBY CHANGED MY NAME AS CHENCHU KRISHNA REDDY CHOPPA (NEW NAME), S/O. PEDDA CHENCHU REDDY CHOPPA.

HEALTH CARE

NEUROLOGIST

డా॥M.సుధాకర్‌రావు, M.D (Gold Medalist) D.M. (Neurology) అన్ని రకముల మెదడు, వెన్నుపూస,నరముల జబ్బులు చూడబడును. సుధాకర్ న్యూరో క్యూర్, రెడ్డి & రెడ్డి కాలని, వెంకటరమణ హాస్పిటల్ ప్రక్కన,తిరుపతి, 0877-2250600,9949916060.

WANTED

రామకృష్ణ గ్రూప్ (AP NO-1), VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 63010 53690, 92814 52838.

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు, ఫ్రీ రూం+భోజనం. Hyd. 7993583999

APSRTC రాయచోటిలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేయుటకుITI Diesel Mechanic అభ్యర్థులు కావలెను.అన్ని రకాల ప్రభుత్వ కంట్రాక్ట్ ఉద్యోగాలకు సంప్ర:9849848817, 9121278009.

నర్సులు కావలెను. ఇంటికి వచ్చి చూసుకొనుటకు అనుభవం గలవారు కావలెను. ఉచిత వసతి, భోజనము కల్పించబడును. మంచి జీతం.సంప్ర: 6300 125 349.

కడపలో ప్రముఖ కార్ వాటర్ సర్వీస్ నందు పనిచేయుటకు సర్వీస్ బాయ్స్/గర్ల్స్,కంప్యూటర్ ఆపరేటర్ (లేడీ) కావలెను లోకల్ వారికి ప్రాధాన్యత. 8328050062

అన్నమయ్య జిల్లా నందు మార్కెటింగ్ చేయుటకు చదవడం మరియు రాయడం, తెలిసిన స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+TA, 8502751010, 9908437200

షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో లేడీవార్డెన్స్, లేడీ కేర్‌టేకర్స్,నర్సులు, కాంపౌండర్స్, వాచ్‌మెన్స్, సెక్యూరిటీ గార్డ్స్, భార్యాభర్తలు కావలెను. 8985114453, 9391086881

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి 9705907418 9705944423 9010223797 9010072409

గమనిక